క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో సమాజ శాంతి



భక్తులకు స్వామి వారి అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెరిగితే సమాజ శాంతి స్థాపన సులభతరమవుతుందని, ప్రజలంతా తమ ఇష్టదైవాలను నిత్యం కొలుచుకుంటూ మానసిక ప్రశాంతత పొందాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక పాండురంగ థియేటర్ రోడ్డులోని దాసాంజనేయ స్వామి ఆలయంలో రెళ్ళ రామ కృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమంలో ఆళ్ళ నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత నాని దాసాంజనేయ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వామి వారి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు

పెదవేగి : రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించి మంగళవారానికి నాలుగేళ్లు పూర్తయిందని ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ అన్నారు. రాక్షస పాలనను అంతమొందించి దెందులూరు నియోజకవర్గంలో సంక్షేమ పాలనకు పునాది పడి స్థానికంగా ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరి గెలిచిన రోజు నియోజకవర్గంలో సంబరాలు మిన్నంటాయని గుర్తు చేశారు. మంగళవారం ఉదయం పెదవేగి మండలం రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి దేవస్థానాన్ని దర్శించుకున్న నాయకులు ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు అబ్బయ్యచౌదరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్ష్మీపురం మార్కెట్ యార్డ్‌లో సంక్షేమ పాలనకు ప్రతీకగా ఏఎంసీ చైర్మన్ మొక్కలు నాటి, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ రైతు సంఘ నేత ఆళ్ళ సతీష్‌చౌదరి, ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ గంగాధరరావు ఆకస్మిక మృతి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రిటైర్డ్ సర్వశిక్షాభియాన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఇంటేటి గంగాధరరావు (47) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన సతీమణి ఇంటేటి మధులత ప్రస్తుతం వైఎస్సార్ సీపీ కొవ్వలి సర్పంచ్‌గా ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చిన గంగాధరరావు అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఇటీవల వలంటరీ రిటైర్డ్‌మెంట్ ఇచ్చారు. విషయం తెలుసుకున్న వెంటనే వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని గంగాధర్ ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు. అనంతరం నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, పార్టీ జిల్లా కార్యదర్శులు గొల్ల వీరాస్వామి, ఎంపీటీసీ జి. వరలక్ష్మి, గొల్ల కిరణ్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

పెదపాడు: పేకాట ఆడుతున్న 8మందిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు మంగళవారం తెలిపారు. మండలంలోని వీరభద్రపురంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై బీ నాగబాబు తన సిబ్బందితో కలిసి దాడి చేసారు. ఈదాడిలో 8మంది వద్ద ఉన్న రూ.7,100 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

- మూడేళ్లలో రూ.6 కోట్ల నిధులు మంజూరు
- సచివాలయ భవనం, ఓవర్‌హెడ్ ట్యాంక్, పాఠశాల భవనం నిర్మాణం



రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయ భవనం



గ్రామ కూడలిలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్



రూ 2.12 కోట్లతో నిర్మిస్తున్న జెడ్పీ పాఠశాల అదనపు తరగతి గదుల పనులు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం కొల్లేరు గ్రామం గుడివాకలంకలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన మౌలిక వసతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంక్షేమ పథకాలతో పేదలు జీవితాలు మెరుగుపడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి కుంటిపడింది. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్ల కాలంలో రూ.6 కోట్ల 40 వేలు నిధులు మంజూరు చేయడంతో పెద్ద ఎత్తున మౌలిక వసతులు ఏర్పాటవుతున్నాయి.

సంక్షేమ పథకాలతో భారీ లబ్ధి

చేపల సాగు, సంప్రదాయ చేపల వేటతో జీవనోపాధి పొందుతున్న ప్రజలకు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ద్వారా లక్షల రూపాయలు ఆర్థిక సహకారం అందిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు గ్రామ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా 527 మంది సుమారు రూ.1.31కోట్లు అందుకున్నారు. 695 మంది అమ్మ ఒడి పథకం ద్వారా రూ. 2,66,13,000 అందుకున్నారు. జగనన్న విద్యా దీవెన ద్వారా 58 మంది లబ్ధిదారులు రూ.41 లక్షలు అందుకున్నారు. 770 మంది డ్వాక్రా సంఘాల సభ్యులు రూ.2,01,33,000 ఆసరా పథకం ద్వారా లబ్ధి పొందారు. 71 మంది అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. వీటితో పాటు ప్రతి నెల 550 మందికి రూ.18 లక్షలకు పైగా పింఛన్ అందిస్తున్నారు.

పూర్తి కావస్తున్న పనులు

గ్రామంలో మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయి. గ్రామ జనాభా ఆధారంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.60 లక్షలు నిధులతో గ్రామ కూడలిలో భారీ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరయ్యాయి. దీనికి తోడుగా రూ.21 లక్షల జలజీవన్ మిషన్ నిధులు వెచ్చించి ఇంటింటికీ తాగునీటి కుళాయిలు బిగించారు. మరో రూ.6 లక్షలతో పైప్‌లైన్ వేసారు. రూ.10 లక్షల మండ పరిషత్ నిధులతో గ్రామ పంచాయతీ తాగునీటి చెరువుల చుట్టూ కంచె నిర్మాణం చేపట్టనున్నారు. జగనన్నకాలనీ మెరక పనుల కోసం ప్రభుత్వం రెండు దఫాలుగా సుమారు రూ.150 లక్షలు మంజూరు చేసింది. వందలాది మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. రూ. 80 లక్షలు ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి సీసీ రోడ్లు వేసారు. మరో 15 లక్షల ఖర్చు చేసి డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు.

రూ. 2.12 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పథకం కొల్లేరు గ్రామాల బాలబాలికలను ఉన్నత విద్యకు బాటలు వేస్తోంది. నాడు-నేడు మొదట విడతలో భాగంగా స్థానిక మండల పరిషత్ పాఠశాల అభివృద్ధికి రూ.14.2 లక్షలు ఖర్చు చేసి తాగునీరు, విద్యుత్, ఫ్లోరింగ్, బల్లలు ఏర్పాటు చేశారు. రెండో విడతలో భాగంగా ఈ ఏడాది సైతం జెడ్పీ పాఠశాలకు రూ.1.95 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి కావస్తోంది.

అర్హులందరికీ పథకాలు



గతంలో ఇంత పెద్ద ఎత్తున నిధుల ఎన్నడూ విడుదల కాలేదు. కోట్ల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్లు, సచివాలయం, పాఠశాల తరగతి గదులు, ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పూర్తి కావస్తున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసినందుకు ప్రభుత్వం గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేయడంతో వాటితో అభివృద్ధి పనులు చేపట్టాం.అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.

– ప్రసాద్, కార్యదర్శి

గ్రామాభివృద్ధిలో ఎమ్మెల్యే పాత్ర మరువలేనిది



గ్రామాభివృద్ధిపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తున్నారు. అందువల్లనే పనులు వేగవంతమవుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గ్రామీణ జీవన స్థితిగతులను మార్చేసాయి. ప్రజలు ఆర్థికంగా బలపడుతున్నారు.

– జయమంగళ రామారావు, మాజీ ఎంపీపీ

నేడు సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి తెలిపారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. ఇన్‌చార్జి ఎంపీడీఓ పరివేక్షణలో నిర్వహించనున్న ఈ సమావేశంలో ఎంపీటీసీలు పాల్గొని అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయనున్నారు.

గ్రంథాలయంలో పిల్లలకు నీతి కథలు

ఉంగుటూరు: వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణలో భాగంగా ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో పిల్లలకు నీతి కథలు బోధించారు. 16వ రోజు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రిసోర్సు పర్సన్ అప్పారావు విద్యార్థులకు నీతి కథలు చదివించడం, కథలు వినిపించడం, పుస్తక సమీక్ష తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. విద్యార్థులతో యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథపాలకుడు గంగాధరరావు పర్యవేక్షించారు.

జ్ఞానాన్ని పంచే కేంద్రాలు గ్రంథాలయాలు

భీమడోలు: విద్యార్థులను ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దేవి గ్రంథాలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శిక్షణ తరగతులు ఉల్లాసవంతమైన వాతావరణంలో సాగాయి. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు ఉత్సుకతను ప్రదర్శించారు. పుస్తక పఠనం చేసారు. యోగాసనాలపై తర్ఫీదు ఇచ్చారు. భీమడోలు, పూళ్లల్లో యోగా నిపుణులు భావనారుషి, కురెళ్ల కిషోర్ శిక్షణ అందించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ నీతి కథలు వివరించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు స్కూలు అసిస్టెంట్ ఉపాధ్యాయుల ఫణికుమార్ జీకే, గణితంపై మెలకువలు అందించారు.

ఈఎస్ఐ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఈఎస్ఐ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈ పథకాన్ని బలోపేతం చేయాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈఎస్ఐ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న ఏలూరు ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈఎస్ఐ చందాదారులైన కార్మికులకు మెరుగైన ఆసుపత్రి సేవలు, మందులు, పెన్షన్లు, సిక్ వేతనాలు, నిరుద్యోగ భృతి తదితర సౌకర్యాలు కల్పించాలని కోరింది. రిజర్వ్ నిధులున్నా కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సమావేశంలో నాయకులు విమర్శించింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు విమర్శించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 27న ఏలూరులో ఉద్యోగులు నిర్వహించే ప్రాంతీయ సదస్సును సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం బలపరుస్తుందన్నారు. అన్ని జిల్లాల్లో కనీసం ఈఎస్ఐ 30 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈఎస్ఐ ఆస్పత్రుల్లో ఆధునిక పరికరాలు, డాక్టర్లు, సిబ్బంది, మందుల సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో పెంచల్ కిషోర్

ఏలూరు(మెట్రో): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను జాప్యం లేకుండా త్వరగా పరిష్కరించి బాధితులకు సత్వరన్యాయం అందించాలని సంబంధిత అధికారులకు ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. పెంచల్ కిషోర్ ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విజిలెన్స్, మానిటరింగ్ సమావేశం ఆర్డీఓ కె. పెంచల్‌కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు ఆయా కేసుల పరిష్కారానికి అధికారులు తీసుకున్న చర్యలు, బాధితులకు జరిగిన లబ్ధిపై కమిటీ సభ్యులు చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ఎస్సీ, ఎస్టీలతో పాటు మిగతా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ మానటరింగ్ సభ్యులు ఎం.అజయ్ బాబు, ప్రవల్లిక, డివిజన్ మెంబర్లు డి.అబ్రహం, రవిజైన్, ఉయ్యాల అప్పారావు, ఏలూరు ఏఎస్‌డబ్ల్యూఓ కె.త్రిమూర్తులు, ఉంగుటూరు, కైకలూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోరుగా మట్టి తవ్వకాలు

ఉంగుటూరు: మట్టి తవ్వకాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ అధికార్లకు భయపడి రాత్రి సమయాల్లో మాత్రమే వ్యాపారులు మట్టి తవ్వుకుంటున్నారు. గోపినాథపట్నం రెవెన్యూ పరిధిలో సోమ, మంగళవారాలు తవ్వకాలు జోరుగా సాగాయి. మెట్టప్రాంతంలోని గ్రామాల్లో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. చేబ్రోలు ఆయకట్టులో మట్టి తవ్వకాలను నిలుపుదల చేసి మైనింగు అధికార్లు పట్టుకుని వదిలేసినట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు మట్టి అమ్మకాలు జోరుగా సాగిస్తున్నారు. తహసీల్దారు పోతురాజు మాట్లాడుతూ ఫిర్యాదు అందిన వెంటనే తవ్వకాలు నిలుపుదలకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల పక్ష పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరులో ఏరియా ఆసుపత్రిని వెంటనే ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రద్దయిన వైద్యులు, వైద్య సిబ్బంది, బెడ్స్‌ను పునరుద్ధరించాలని అఖిల పక్ష పార్టీల నాయకులు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, జనసేన, ఆమ్ ఆద్మీ తదితర పార్టీల నాయకులు మంగళవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని సందర్శించి, వైద్య కళాశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేసారు. ముఖ్యంగా ఏలూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలకు ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రధాన ఆధారం అన్నారు. ఒక్క ఏలూరు జనాభా 3.50లక్షలు ఉందని, అందువల్ల ఏలూరులో ఒక ద్వితీయ శ్రేణి ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి డీఆర్వో సత్యనారాయణ మూర్తికి వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, న్యూడెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు, జనసేన ఏలూరు సిటీ అధ్యక్షుడు నగిరెడ్డి కాశి నరేష్, ఆప్ ఏలూరు కన్వీనర్ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

ఆంగ్ల మాధ్యమ విధానాన్ని వినియోగించుకోండి



చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పొలిమేర హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన ఇంగ్లీషు మాధ్యమంలో చేర్పించాలని రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొలిమేర హరికృష్ణ కోరారు.స్థానిక గన్‌బజార్, కబాడీగూడెం, శనివారపు పేటలలో చర్మకారులు, పేద సామాజిక వర్గాల వారు నివసించే ప్రాంతాల్లో పల్లె పయనం పేరుతో ఆయా సామాజిక వర్గాల వారికి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తయారు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను అందిపుచ్చుకుని విద్యామార్గం వైపు పయనించాలని పిలుపు నిచ్చారు. పేద విద్యార్థులను వ్యక్తిగతంగా ప్రోత్సహించే స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నానికి చర్మకారుల సంక్షేమ సంఘం తరుపున అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పలువురు చర్మకారులు, ఆయా సామాజిక వర్గాల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : మహిళలు అన్ని రకాలుగా ఆర్థిక స్వావలంబన సాధించి అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం డ్వాక్రా సంఘాల మహిళలతో ఎమ్మెల్యే మంగళవారం ముఖాముఖి నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలతో నేరుగా సమావేశమై వారి అవసరతలు తెలుసుకుని, పరిష్కరించే దిశగా సమావేశం ఏర్పాటు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొప్పులవారిగూడెం సచివాలయ పరిధిలో 53 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, వైఎస్సార్ ఆసరా 35 స్వయం సహాయక సంఘాలకు రూ 90. 75 లక్షలు ప్రభుత్వం అందించామని అబ్బయ్యచౌదరి అన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ 2019-20 సంవత్సరంలో పొందిన 32 స్వయం సహాయక సంఘాలకు రూ.5.41 లక్షలు, 2020-21లో 40 గ్రూపులకు రూ.6.49 లక్షలు, 2021-22లో 42 గ్రూపులకు రూ.7.45 లక్షలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే మహిళలకు వివరించారు. అనంతరం ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే చెప్పమని ఎమ్మెల్యే బహిరంగంగా మహిళలను కోరారు. అందులో కొంతమంది ఇంటి రుణాలు, స్థలాలు ఇలా పలు అవసరతలు, పథకాలపై అబ్బయ్యచౌదరిని వేడుకున్నారు. దీనిపై తక్షణం స్పందించిన ఆయన వెంటనే పేర్లను నమోదు చేసి, త్వరితగతిన ప్రతి ఒక్కరికీ అన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సభా ముఖంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, పెదవేగి సొసైటీ చైర్మన్ పెనుమాక వెంకట సుబ్బారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, సర్పంచ్ చలపాటి మణి సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ కొరసిక గంగారత్నం పుష్పవతి, బలుసు శ్రీధర్, గ్రామపార్టీ అధ్యక్షుడు తానంకి విష్ణు, ఎంపీటీసీ యర్రా సలోమి వెంకటరత్నం, చలపాటి నాగేశ్వరరావు, బలుసు కిషోర్, వీరంకి సుబ్బారావు, బలుసు రామదాసు, ఎం చిన్ని, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, ఏపీఎం బట్టు శరత్‌బాబు, సీసీలు కె సృజన, డ్వాక్రా సీఏలు బేబి, ధనలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

ఉంగుటూరు: రావులపర్రు గ్రామంలో యువతి ఆత్మహత్య కేసులో నిందితుడిగా అనుమానిస్తున్న అదే గ్రామానికి చెందిన జలసూత్రం శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనివాస్ ప్రేమ పేరుతో వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో మలికి భవాని (21) మనస్థాపానికి గురైంది. తల్లిదండ్రులు లేని సమయంలో ఆమె ఈనెల 12న ఇంటి రేకుల షెడ్డుకు ఉరివేసుకుంది. ఈ ఘటనపై చేబ్రోలు ఎస్సై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు జలసూత్రం శ్రీనివాసును మంగళవారం అరెస్టు చేసి తాడేపల్లిగూడెం ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరపర్చగా రిమాండు విధించినట్లు ఎస్సై వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	16

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	24
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	28

అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ బృందం



పీహెచ్‌సీలో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ టి.యన్.స్నేహన్

పెదవేగి : ప్రజలందరికీ ఆరోగ్యం అందించేందుకు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ప్రభుత్వం గ్రామస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసిందని సచివాయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టి.యన్.స్నేహన్ చెప్పారు. మంగళవారం పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ఇ.వి.ఎల్. మాధవి అధ్యక్షతన గ్రామస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్నేహన్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకోసం గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి టీం లీడర్‌గా 5 సభ్యులతో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైందని చెప్పారు. ఈ టీం ప్రతి నెలా సమావేశమైన గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై చర్చించుకుని అందరికీ ఆరోగ్యం అందేలా చూడాలన్నారు. ప్రధానంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సు బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. యుక్త వయసు బాలికలకు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయాలన్నారు. ఇవన్నీ సక్రమంగా నిర్వహించేందుకు గ్రామస్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ ఏర్పాటు చేయాలని జి.ఓ నంబర్ 34 జారీ అయ్యిందని చెప్పారు. దీని ప్రకారం వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలోని సామాజిక ఆరోగ్య అధికారి లీడర్‌గా ఉన్న కమిటీలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్త, పాఠశాల ఆరోగ్య అంబాసిడర్, గ్రామ సంఘం అధ్యక్షుడు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య పరిస్థితులు మెరుగుపర్చటం, అనారోగ్య వంతులకు సేవలు చేయటంలాంటి పనులు ఈ కమిటీ చూడాలన్నారు. అందుకోసం ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి చర్చించాలని చెప్పారు. ఈ కమిటీలు సమావేశాలు నిర్వహించేలా మెడికల్ ఆఫీసర్ సమన్వయం చేయాలన్నారు. ఈ విధంగా ప్రజలకు ఆరోగ్యం అందించి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆలోచనమేరకు రక్తహీన రహిత జిల్లాగా మార్చటానికి ప్రతి ఒక్కరం అంకిత భావంతో పనిచేయాలని హితవు పలికారు. అనంతరం మండలంలోని వెంకట కృష్ణాపురం, దిబ్బగూడెం అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. గర్భిణులు రక్త పరీక్షలు నిరంతరం చేయాలన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మాధవి, గ్రేడ్ వన్ సామాజిక ఆరోగ్య అధికారి డి.రోజ్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.